వైఎస్సార్‌సీపీకి ప్రజలే అండ

- రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన సీఎం జగన్
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ప్రజలు నమ్మరు
- ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- 86వ వార్డులో పండగ వాతావరణంలో ఎన్నికల ప్రచారం



86వ వార్డులో వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌కు పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న అభిమానులు



మహిళలకు కరపత్రాలను అందిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: రైతులకు, కార్మికులకు, విద్యార్థులకు .. ఇలా అన్ని వర్గాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో భరోసా కల్పించారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. తమను ఆదుకున్న సీఎంకు ఆ ప్రజలే అండగా ఉన్నారన్నారు. జీవీఎంసీ 86వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో వివరిస్తూ.. కూటమికి ఓటు వేస్తే కలిగే నష్టాలను తెలియజేస్తూ ఆయన పర్యటన సాగింది. ముందుగా రాసాలమ్మ కాలనీలోని రాసాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీ నుంచి రాజీవ్ నగర్ పార్కు వరకు పర్యటించారు.

99శాతం హామీల అమలు

వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి 99శాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ఎన్నో పేద కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు– వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను వికేంద్రీకరించి, ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు.

కూటమిని నమ్మవద్దు

2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కూటమి ఇచ్చిన



ప్రచారంలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

హామీల అమలుకు నాదీ పూచీ అని పవన్‌కల్యాణ్ మాట ఇచ్చారని, వాటిలో 10శాతం కూడా నెరవేర్చకపోయినా కనీసం ప్రశ్నించలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. దీంతో ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో మ్యానిఫెస్టోను వెబ్‌సైట్ నుంచే మాయం చేశారని దుయ్యబట్టారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయకుండా రైతులను, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మహిళలను, ఇంటికో ఉద్యోగం ఇస్తానని నిరుద్యోగులను.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఓట్లు అడగడానికి వస్తున్నారని, అటువంటి వారికి నమ్మవద్దని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉరుకూటి చందు, వీవీఎస్‌ఎం రాజు, మంత్రి రాజశేఖర్, వార్డు అధ్యక్షులు వెలుగుల పరశురాముడు, రామచంద్రరాజు, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్, మండలాధ్యక్షులు బొద్ద గోవింద్, నిర్మల, హరీష్‌వర్మ, శ్రీనివాస్, ఎం. చిన్నా, నమ్మి ప్రసాద్, సన్యాసిరావు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మరిన్ని పథకాలు తీసుకొస్తాం



చైతన్యనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి



మెహర్‌నగర్‌లో నివాసులను కలిసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న అమర్‌నాథ్

గాజువాక: అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ గాజువాక అసెంబ్లీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. 72వ వార్డులోని మెహర్‌నగర్, చైతన్యనగర్, చినగంట్యాడ, సోషల్ వెల్ఫేర్ కాలనీల్లో ఆయన ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకపక్క అపార్ట్‌మెంట్‌వాసులను, మరోపక్క కాలనీవాసులను కలుసుకుని మద్దతు కోరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఈ సందర్భంగా నివాసులకు వివరించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి హయాంలో గాజువాకలో సాధించిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని, తమను గెలిపిస్తే మరిన్ని పథకాలను తీసుకొస్తామని తెలిపారు. ప్రచారంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గం అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, రాజాన వెంకటరావు, రెడ్డి జగన్నాథం, పాగిరి రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, ఉరుకూటి అప్పారావు, విజయ, ధనలక్ష్మి, నాగమణి, భవాని, రాజాన వెంకటరావు, మధు, వాసవి నాయుడు, మధుసూదన్‌రెడ్డి, కుమార్ సాయి, ధనాల ఉమ, దీప్తి, నర్సింగరావు, మొల్లి చిన్న, సిరసపల్లి శ్రీనివాసరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రైత సిద్ధాంతం తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. 87వ వార్డు వడ్లపూడి వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రూపొందించిన ఈ క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి, ప్రతీ ఒక్కరికి అర్థమయ్యే విధంగా సరళమైన భాషలో అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఐపీఎం కాన్ఫరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే, ఎన్‌ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం) కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఎన్‌ఐపీఎం విశాఖ చాప్టర్, స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఈ నెల 26న ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో ‘ హెచ్‌ఆర్ అభ్యాసాల ద్వారా సంస్థ యొక్క రూపాంతరంలో ఉద్యోగుల అనుభవం, ఉద్యోగుల పాత్ర’ థీమ్‌పై కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఐపీఎం రీజనల్ వైస్ ప్రెసిడెంట్ బి.శేషగిరిరావు, చాప్టర్ కార్యదర్శి డాక్టర్ మురళీధరరావు, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, స్టీల్‌ప్లాంట్ సీనియర్ అధికారులు, ఎన్‌ఐపీఎం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలుతో బాలలకు భరోసా



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల బాలలకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాల్సి ఉందని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రవేశపెట్టి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వాలన్నారు. చట్టం అమలు తీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో సున్నా నుంచి 18 ఏళ్ల వయసు గల బాలలందరినీ చట్ట పరిధిలోకి తేవాలని కోరారు. వక్తలు పి.కె.జోషి, రమాదేవి, గౌరీశంకర్, మణి, హరగోపాల్ పాల్గొన్నారు.

ముస్లింల సేవలు స్ఫూర్తిదాయకం

- హిందూ, ముస్లింల సమైక్యత మత సామరస్యానికి నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

గాజువాక: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. గాజువాకలోని దారుల్ ఉలూమ్ ఇన్నాకియా మసీదులో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ముస్లింలు రంజాన్‌లో కఠోర ఉపవాసాలు ఉంటూ ప్రార్థనలు చేయడం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఈ మాసంలో ముస్లింలు ఎవ్వరూ తమ ఇళ్లల్లో ఇబ్బంది పడకుండా ఉండటం కోసం చేపట్టే వితరణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గాజువాక వంటి ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు అనే తేడా ఉండదని, అందరూ సోదరుల్లా కలిసి మెలిసి జీవించడం ఇక్కడి సమైక్యతకు, మత సామరస్యానికి నిదర్శమన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

ఇక్కడి ప్రజలకు సేవ చేసేందుకే ..

తాను కూడా ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగానని ఝాన్సీ అన్నారు. ఈ ప్రాంతంలో అందరూ తనకు కుటుంబ సభ్యులలాంటివారన్నారు. తనను ఆదరించిన ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తనకు పోటీ చేసే అవకాశం కల్పించారని చెప్పారు. తన గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ గౌస్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పద్మవ్యూహాన్ని ఛేదించే అర్జునుడే జగన్

- పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధమిది..
- ఎన్నికల్లో కూటమికి గుణపాఠం తప్పదు
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



అమర్‌నాథ్‌కు బుద్ధుని విగ్రహం బహూకరిస్తున్న తిప్పల వంశీరెడ్డి, దేవన్‌రెడ్డి



87వ వార్డు సీనియర్ నాయకులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న గుడివాడ అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న రాజకీయ పద్మవ్యూహంలో జగన్‌మోహన్ రెడ్డి అర్జునుడిలా విజయం సాధిస్తారని గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎన్నికల్లో కూటమికి గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి గణేష్‌నగర్‌లో ఇల్లపు రాము ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వడ్లపూడిలోని దానప్పతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీనియర్ నాయకులతో చర్చించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం

విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్ర రాష్ట్రానికే మణిహారమని, అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని అమర్‌నాథ్ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీతోనే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తులు పెట్టుకున్నాయని, ప్రజలను నిర్వాసితులను మోసం చేస్తున్న అటువంటి పార్టీలకు జగన్ సైన్యంతో తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. పేద ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని మరోసారి ఇవ్వాలని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గాజువాకలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు బొద్ద గోవింద్, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, ఆదినారాయణ, దాసరి శ్రీనివాస్, గాలి ఆనంద్, సింహాచలం, ఇతర సీనియర్ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరు

పెదగంట్యాడ: రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. పెదగంట్యాడలోని దేవన్‌రెడ్డి నివాసంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గాజువాకను గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశామన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

అమర్ విజయానికి కృషి చేయాలి

కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అమర్‌నాథ్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ 40 రోజులు కష్టపడి పని చేస్తే ఐదేళ్లపాటు పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, గొందేశి సత్యారావు, ఎన్వై నాయుడు, జీలకర్ర నాగేంద్ర, దల్లి పైడికొండ, సత్తిరెడ్డి, దుర్గారావు, సీతారామ్, పవన్‌కుమార్, ఆళ్ల రామకృష్ణ, లోకేష్, త్రినాథ్, కరజాడ కృష్ణ, గొరుసు సత్యం, ఒమ్మి ఈశ్వరి, విజయలక్ష్మి, పద్మ, గొరుసు రామలక్ష్మి, గళ్లా శంకర్‌సాయిరాం, గంధం సాయి, వియ్యపు కిశోర్, రాజేష్, కోన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



పెదగంట్యాడ జంక్షన్‌లో శాంతిర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ఏసుక్రీస్తు పునరుత్థాన పుణ్యదినం ఈస్టర్‌ను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. 68వ వార్డ్ రాంనగర్‌లోని యునైటెడ్ ఇమ్మాన్యుయేల్ చర్చిలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్, అధక్షుడు కె.లాబర్ రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

పెదగంట్యాడలో శాంతి ర్యాలీ

పెదగంట్యాడ: ఈస్టర్ వేడుకలను పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ కణితి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు బోధ సర్వ మానవాళికి అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో ఉరుకూటి చందు, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, గొందేశి సత్యారావు, నక్క వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



లూథరన్ చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లూథరన్ చర్చి, క్రైస్ట్ ది సేవియర్ చర్చి, ది అసెంబ్లీ ఆఫ్ గాడ్, ఆర్‌సీఎం చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లూథరన్ చర్చిలో పాస్టర్ ఆంద్రూ గ్రేస్ రాజు, ఇమ్మాన్యుయల్ సువర్ణరాజు, నక్క సురేష్, పెద్ద ఎత్తున భక్తులు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఎందరికో ప్రాణదానం

ఉక్కునగరం: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లే అని స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాధిపతి ఉద్దం నాగ్ అన్నారు. సత్యసాయి 99వ జయంతి సందర్భంగా ఉక్కునగరం సత్యసాయి సమితి, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాల్లో పాల్గోవడం వల్ల సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

60వ సారి రక్తదానం

రక్తదాన శిబిరంలో దేశపాత్రునిపాలెంకు చెందిన 63 ఏళ్ల అట్లూరి శేషగిరిరావు 60వ సారి రక్తదానం చేశారు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ ఆర్.ఎం.హెచ్.పి విభాగం ఉద్యోగి కె.వి.ఎల్.ఎన్. రెడ్డి 18 ఏళ్ల కుమార్తె సాయి ప్రత్యూష మొదటిసారి రక్తదానం చేశారు.



60వ సారి రక్తదానం చేసిన శేషగిరిరావుకు సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

శిబిరంలో నలుగురు మహిళలు కూడా రక్తదానం చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, అమ్మ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 99 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, కర్రి శ్రీనివాస్, ఆర్.ఎ.నాయుడు, కె.ఎస్.ఎన్.రాజు, కె.వి.ఎల్.ఎన్.రెడ్డి, జేసీఐ ఉపాధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఓటర్లకు అవగాహన

పెందుర్తి: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలో ఆదివారం ‘మన పోలింగ్ బూత్–మన ఓటు’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆర్వో పి.శేష శైలజ ఆధ్వర్యంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ, జీవీఎంసీ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై సింహాచలేశుడు

- వైభవంగా తిరువీధి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామికి గరుడ వాహనంపై తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను ముస్తాబుచేసి గరుడ వాహనంపై అధిష్ఠం పజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనంపై ఆశీనుడైన స్వామిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. నృత్య కళాకారులు స్వామికి స్వాగతం పలికారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడవాహనంపై అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



స్వామికి స్వాగతం పలుకుతున్న నృత్య కళాకారులు

కొనసాగుతున్న ఉక్కు రిలే దీక్షలు



1144వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించాల్సిందేనన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1144వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ సూర్యారావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.